వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

కశ్మీర్‌లో సీట్ల మార్పు

జమ్ముకశ్మీర్‌పై లోక్‌సభ బుధవారం రెండు కీలక బిల్లులను ఆమోదించింది. అందులో మొదటిది జమ్ము, కశ్మీర్ పునర్ వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు, రెండోది జమ్ము, కశ్మీర్ రిజర్వేషన్ (సవరణ) బిల్లు. జమ్ము, కశ్మీర్ ప్రాంతాల్లో అసెంబ్లీ సీట్లు పెంచడం, అందులో కొన్నింటిని రిజర్వ్ చేయడం వీటి ముఖ్య ఉద్దేశం. ఈ బిల్లులపై చర్చ సందర్భంగా పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) అంశాన్ని కేంద్రం హోం మంత్రి అమిత్ షా ప్రస్తావించడం గమనార్హం. ఆయన పీవోకే భూభాగానికి కూడా అసెంబ్లీ సీట్లను రిజర్వ్ చేస్తున్నట్టు చెప్పారు. అందుకు కారణం అది కూడా మనదేనని అనడం, అంతటితో ఆగకుండా ఆ భూ భాగం పాక్ చేతుల్లోకి పోవడానికి నాటి ప్రధాని నెహ్రూ ఘోర తప్పిదమే కారణమని అనడంపై వివాదం తలెత్తింది. షా వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం తెలిపారు. నిరసనగా సభ నుంచి వాకౌట్ చేస్తూ వచ్చే పార్లమెంటు ఎన్నికల్లోగా పీవోకేను తీసుకురమ్మని హోంమంత్రికి సవాల్ విసిరారు. ఈ చర్చ పాలక, విపక్షాల మధ్య చారిత్రిక అంశాలపై గల విభేదాలను ప్రముఖంగా ముందుకు తెచ్చింది.

పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న వేళ అమిత్ షా పాక్ ఆక్రమిత కశ్మీర్ గురించి ప్రస్తావించడం చర్చనీయాంశమైంది. పీవోకేను పాకిస్థాన్ కొన్నాళ్లుగా అజాద్ కశ్మీర్‌గా స్వయంప్రతిపత్తితో కొనసాగించి తర్వాత పూర్తిగా తన ఆధిపత్యంలోకి తెచ్చుకున్నది. ఈ నేపథ్యంలో అక్కడి అసెంబ్లీ సీట్ల గురించి మాట్లాడటం ఏమిటనేది ఇక్కడ ప్రశ్న. ఆ భూ భాగం మాదేనన్న అంశంపై భారత్‌లో సాధారణంగా అయితే భిన్నాభిప్రాయాలకు తావులేదు. కానీ తాము మాత్రమే అలా అనగలుగుతున్నామనే ధోరణి కేంద్ర హోంమంత్రి మాటల్లో వ్యక్తమైంది. గత పార్లమెంటు ఎన్నికల సందర్భంగా కేంద్రంలోని బీజేపీ పుల్వామా ఉగ్రదాడిని, బాలాకోట్ సర్జికల్ స్ట్రైక్స్‌ను తనకు అనుకూలంగా ఉపయోగించుకున్నట్టుగానే పీవోకే సమస్యను ఈసారి వాడుకోవాలని చూస్తున్నదా అనే సందేహాలూ వ్యక్తమవుతున్నాయి.

స్వాతంత్ర్యంతోపాటుగా సంక్రమించిన కశ్మీర్ సమస్య రావణకాష్టంలా రాజుకుంటూనే ఉన్నది. ఆ ప్రాంతంలో తీవ్రవాదం, ఉగ్రవాదం పెచ్చరిల్లి అనేక మందిని బలిగొనడం ఓ చారిత్రక విషాదం. కశ్మీర్ సంస్థానాధీశుడైన రాజా హరిసింగ్ భారత ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ఫలితంగా వచ్చిన ఆర్టికల్-370ని మోదీ ప్రభుత్వం నాలుగేండ్ల కిందట రద్దుచేసింది. అదేవిధంగా జమ్ముకశ్మీర్ రాష్ర్టాన్ని మూడు ప్రాంతాలుగా విడగొట్టింది. అసెంబ్లీ కలిగిన కేంద్రపాలిత ప్రాంతాలుగా జమ్ము, కశ్మీర్, అసెంబ్లీ లేని కేంద్రపాలిత ప్రాంతంగా లద్దఖ్ మారిపోయాయి. అయితే అందులో దేనికీ ఇప్పటివరకు ప్రజాప్రాతినిధ్య పాలన రాలేదు. రద్దుకు ముందు తర్వాత సుమారు ఆరేడేండ్లుగా ఈ మూడు ప్రాంతాల్లో ఎన్నికలే జరుగలేదు. తాజాగా తెచ్చిన చట్టాలతో నియోజకవర్గాలూ, రిజర్వేషన్ల విషయంలో స్పష్టత వచ్చిన మాట వాస్తవం. ఇకనైనా వీలైనంత త్వరలో ఎన్నికలు జరిపితే బాగుంటుంది. శాంతిభద్రతల పరిస్థితి, ముఖ్యంగా కశ్మీర్‌లో సుస్థిరత అందుకు సహకరించాల్సి ఉంటుంది.

రెండు కర్రల సాము అవసరం

బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం కాగల అవకాశాలపై దృష్టి ఎంత అవసరమో, సంస్థాగతంగా, పాలనాపరంగా స్వయంగా తనలో చోటుచేసుకున్నాయనుకునే లోటుపాట్లను సవరించుకోవటం కూడా అంతే అవసరం. ప్రజలు ఈ రెండింటినీ గమనిస్తారు. కాంగ్రెస్ తన హామీలు అమలుపరుస్తున్నదా లేదా? పరిపాలన సజావుగా సాగుతున్నదా లేదా? అని ఒక కంట చూస్తారు. ఎన్నికల తర్వాత బీఆర్ఎస్‌లో దిద్దుబాటుకు సంబంధించి జరుగుతున్నదేమిటో కూడా మరో కంట గమనిస్తారు. కనుక బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ వైఫల్యాలుంటే వాటిని ఎత్తిచూపుతూనే, తనను తాను సరిదిద్దుకోవటం ద్వారా మాత్రమే ప్రజల విశ్వాసం తిరిగి పొందగలదు.

టంకశాల అశోక్

కాంగ్రెస్ కుప్పలుతెప్పలుగా ఇచ్చిన హామీల అమలు అసాధ్యమని, అందుకు అవసరమైన ఆర్థిక వనరులు రాష్ర్టానికి లేవనే మాట నిపుణుల నుంచి బలంగా వినవస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాల అమలుకే నిధులు బొటాబొటిగా ఉండేవి. కాగా, కాంగ్రెస్ పార్టీ ఆ పథకాలను కొనసాగించటమే గాక వాటిలో కొన్నింటి కోసం మరింత ఖర్చు చేయగలమని చెప్పింది. ఉదాహరణకు రైతుబంధు. అదిగాక అనేక కొత్త పథకాలు ప్రకటించింది. ఉదాహరణకు వ్యవసాయ కూలీలకు సొమ్ము. ఆరు గ్యారంటీలు కాక మరికొన్ని డిక్లరేషన్లు కూడా ఉన్నాయి. ఇట్లా అన్నింటికి కలిపి అయ్యే మొత్తం అసలు రాష్ట్ర బడ్జెట్‌నే మించిపోగలదని పలువురు నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇదంతా విఫలమైనట్టయితే ప్రజల్లో అసంతృప్తి తీవ్రస్థాయిలో ఏర్పడగలదని ఎవరైనా చెప్పగలరు. ఇదంతా గాక కాంగ్రెస్‌లో గ్రూపు కలహాలు, రాజకీయ అస్థిరత అన్నది మరొక అంశం. అందువల్ల పరిపాలనపై ప్రభావం ఉన్నా లేకపోయినా, ప్రజలు మెచ్చుకోగల పరిస్థితి కాదది. వారు దానిని ఇంతకాలం బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉండిన స్థితితో పోల్చి చూస్తారు. అయినా వారికి హామీల అమలు, అభివృద్ధే ప్రధానమవుతాయి.

కనుక బీఆర్ఎస్ పార్టీ ఈ పరిస్థితులను గమనిస్తూ, అందులో ప్రజలకు, రాష్ర్టానికి నష్టం చేయగలవాటిని, కాంగ్రెస్ హామీల రీత్యా ప్రజలను నిరాశపరచగలవాటిని ఎప్పటికప్పుడు ఎత్తిచూపుతుండ వలసిందే. ఇదంతా ఒక చేత చేసే ఒక కర్రసాము. అయితే గుర్తించవలసిందేమంటే, కేవలం ఒక కర్రసాము వల్ల బీఆర్ఎస్‌కు తిరిగి గెలుపు లభించటం కష్టం. పరిస్థితులు అంతగా కలిసివస్తే, నెగెటివ్ ఓటు గణనీయంగా పెరిగితే సాధ్యం కావచ్చు. కానీ, తేలిక కాదు. ఎందుకంటే, ప్రజలు బీఆర్ఎస్ గురించి, 'వీళ్ల మాత్రం మారిందేమిటి?' అన్నా అనవచ్చు. అటువంటి భావన ఏర్పడితే, కాంగ్రెస్‌పై గల నెగెటివ్ ఆలోచన అదృశ్యం కాకున్నా కొంత తగ్గే అవకాశం ఉంటుంది.

కాంగ్రెస్ విఫలమైతీరుతుందని, అప్పుడు అవకాశం తిరిగి తమకు ఆటోమేటిక్‌గా రాగలదని బీఆర్ఎస్‌లో కొందరు ఆశిస్తుండవచ్చు. పైన చెప్పినవన్నీ ముఖ్యంగా వారు ఆలోచించవలసిన విషయాలు. రాగలకాలంలో జరగవలసింది, కాంగ్రెస్ వైఫల్యాల మాట ఎట్లున్నా ఎట్లుండకపోయినా, మౌలికంగా బీఆర్ఎస్ పటిష్ఠంగా మారి, లోటుపాట్లను తొలగించుకొని, తిరిగి ప్రజల విశ్వాసాన్ని వెనుకటి స్థాయిలో పొందటం. అది రెండవ చేతితో చేసే రెండవ కర్రసాము అవుతుంది. అట్లా కాకుండా కేవలం కాంగ్రెస్ వైఫల్యాలపై దృష్టిపెట్టి అది జరిగితేనే తిరిగి అధికారానికి రావాలనుకోవటం పెద్ద తప్పు అవుతుంది.

ఈ సారి ఎన్నికల ఫలితాలను యథాతథంగా పరిశీలించినప్పుడు, బీఆర్ఎస్‌కు లభించిన ఓట్లు, సీట్లు గణనీయమైనవే. అదెంత వాస్తవమో అవి 2018తో పోల్చినప్పుడు బాగా తగ్గాయన్నది కూడా అంతే వాస్తవం. ఇది ఒకటి కాగా పార్టీ గెలుపోటములతో నిమిత్తం లేకుండా ముఖ్యమంత్రి స్థానానికి కేసీఆరే ఇప్పటికీ అందరికన్న అర్హుడని, తన పరిపాలన సంతృప్తికరమని ప్రజలు అన్ని సర్వేలలో పోలింగ్‌కు ముందు, తర్వాత సైతం చెప్పిన మాటలు గమనార్హం. బీఆర్ఎస్ పార్టీకి ఇప్పుడు ఈ స్థాయి గౌరవప్రదమైన ఓట్లు, సీట్లతో పాటు, అంతకన్న ముఖ్యంగా నాయకుడు కేసీఆర్ పట్ల, ఆయన ప్రభుత్వ పాలన పట్ల, ఈ ఓటమిలోనూ ఈ స్థాయిలో గల సానుకూల ప్రజాభిప్రాయం పెద్ద బలాలు. ఇంత ఉండినా పార్టీ ఎందుకు ఓడిందన్న ప్రశ్నకు ఆయా సర్వేలలో ప్రజలే వివరణ ఇచ్చినందున ఇక్కడ తిరిగి రాయనక్కరలేదు. జరగవలసింది అక్కడినుంచి ఆరంభించి ఇంటి గోడలను, నేలను తిరిగి మెత్తుకోవటం. రెండవ చేత చేసే రెండవ కర్రసాము ఇదే.

ఈ రెండింటినీ చేయటంలోనే సరైన రాజకీయ విజ్ఞత ఉంటుంది. ఇందులో రెండవ పని ఇప్పటినుంచే జరగాలి కానీ, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల కోసం వేచి చూడనక్కరలేదు. ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వం తనకు తాను వంద రోజుల గడువు పెట్టుకున్నది. ఆరు నెలల దాకా వేచి చూద్దామన్నారు కేసీఆర్. కొత్త ప్రభుత్వం ఆధ్వర్యంలో కొత్త బడ్జెట్ వచ్చి, ఆయా అభివృద్ధి, సంక్షేమాల విషయమై ప్రభుత్వ విధానాలు, కేటాయింపులు ఏమిటో స్పష్టత వచ్చి, వాటి అమలు మొదలయ్యేది ఏప్రిల్ నుంచి గనుక, తర్వాత మరొక రెండు నెలలు కలిపి ఆరు నెలలని కేసీఆర్ అన్నారేమో చెప్పలేం. అదే అనుకుంటే, ప్రభుత్వానికి ఇచ్చే ఈ ఆరు మాసాల కాలాన్ని ప్రభుత్వానికి ఇచ్చినా, ఈ కాలమంతా బీఆర్ఎస్‌కు సెలవు కాలం కానక్కరలేదు. పైన చెప్పుకొన్న రెండవ చేతికర్రసామును పార్టీ కోసం ఇప్పటినుంచే మొదలు చేయవచ్చు. అది పార్టీ విషయాల పరిశీలన, లోటుపాట్ల సవరణ, సంస్థ బలోపేతం. ఒకవైపు ఈ పనిచేస్తూనే ఈ కాలంలో ప్రభుత్వ పనితీరును గమనించటం సహజంగా జరిగే పని. ఆరు నెలల తర్వాత ఇంకొక చేతి సాము ప్రభుత్వ వైఫల్యాలపై మొదలవుతుంది. ఈ రెండు సాములు ఏ విధంగా మొదలై సాగుతాయనే దృశ్యాలు ప్రజలకు అప్పటినుంచి కనిపిస్తాయి. ప్రభుత్వం పనితీరు గురించి ప్రజలకు 2024 ద్వితీయార్థం నుంచి ఆరంభించి మాటలు, గ్యారంటీలు, మ్యానిఫెస్టోలకు ఆవల వాస్తవమైన, ఆచరణపూర్వకమైన పాలన ఏ విధంగా ఉండేదీ అనుభవానికి వస్తుందన్న మాట. ఆ వేళకు బీఆర్ఎస్ పార్టీ తనను తాను గరిష్ఠ స్థాయిలో లోప రహితం, శక్తివంతం చేసుకొని సిద్ధంగా ఉండవలసి ఉంటుంది.

నిజానికి ఇటువంటి లోపాలు పార్టీ నిర్మాణపరంగా, నిర్వహణ పరంగా ఉన్నందువల్లనే ఇతర పార్టీలు గాని, కొందరు మేధావులు గాని చేసిన అనేక అసత్య ప్రచారాలకు సకాలంలో, సమర్థవంతంగా బీఆర్ఎస్ సమాధానాలు చెప్పలేకపోయింది. అదే విధంగా ప్రభుత్వం చేసిన మంచి పనులను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించలేకపోవటం, ప్రజల సందేహాలను, ఫిర్యాదులను తెలుసుకొని వారిని సమాధాన పరచలేకపోవటం వంటివన్నీ చివరికి నష్టాలను కలిగించాయి. ఇప్పుడు పైన చర్చించిన తరహా కార్యక్రమం జరిగినట్టయితే ఆ క్రమంలో భాగంగా ఇటువంటి సమస్యలు తొలగిపోయే అవకాశం కూడా ఉంటుంది.

పోతే, బీఆర్ఎస్ ప్రభుత్వం తన పదేండ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమాలకు సంబంధించి కొన్ని బెంచ్ మార్క్‌లను నెలకొల్పింది. వాటిని ప్రస్తుత ప్రభుత్వమైనా వీలైతే ఇంకాముందుకు తీసుకుపోవలసి ఉంటుంది తప్ప తిరుగుముఖం పట్టించటం వీలయ్యే పనికాదు. ఉదాహరణకు వ్యవసాయరంగంలో స్వయం సమృద్ధి. అందుకు అవసరమైన నీటి వనరుల కల్పన, విద్యుత్తు సరఫరా, సాగు పెట్టుబడి సమకూర్చటం, ఎరువులకు, విత్తనాలకు కొరత లేకుండా చూడటం, ధాన్యం మొత్తం రైతుల నుంచి ప్రభుత్వమే కొనుగోలు చేయటం వంటివి. అదేవిధంగా పారిశ్రామిక, ఐటీ రంగాలలో సాధించిన గణనీయమైన అభివృద్ధి. ప్రభుత్వ రాబడి పెరుగుదల. గ్రామీణ, పట్టణ వికాసంలో నెలకొల్పిన జాతీయ రికార్డులు, మౌలిక వసతుల కల్పన. మంచినీటి సరఫరా, వైద్య వసతులు, తలసరి ఆదాయాలు, మానవాభివృద్ధి సూచికలు మొదలైనవి. సంక్షేమ విషయంలో దళితబంధు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, వివిధ గ్రామీణ వృత్తుల వారి స్వయం పోషకత వంటివి. ఈ బెంచ్ మార్క్‌లను కొత్త ప్రభుత్వం కొనసాగించక తప్పదు. వీలైతే ఇంకా మెరుగుపరచటం తప్ప, రద్దు చేయాలనుకున్నా, తగ్గించినా ప్రజలు ఎంతమాత్రం ఆమోదించబోరు. అవి ఏ ప్రభుత్వపు బెంచ్‌మార్క్‌లో ప్రజలకు తెలుసు. అందువల్ల బీఆర్ఎస్ పార్టీ రాగల కాలంలో వీటికి వాచ్‌మన్‌గా కూడా ప్రజల తరపున వ్యవహరించవలసి ఉంటుంది. ఇవన్నీ ఒక ఫెడరల్ పార్టీ తమ ప్రజల కోసం, ప్రాంతం కోసం నిర్వర్తించవలసిన కర్తవ్యాలు కూడా. ఆ ప్రజలకు ఫెడరలిజమే అన్నింటికి మించిన భద్రత. తెలంగాణకు గల ఏకైక, నిజమైన ఫెడరల్ పార్టీ బీఆర్ఎస్ మాత్రమే.

గర్జించే గెలుపేమీ కాదు!

కందిబండ కృష్ణప్రసాద్
91827 77010

దేశంలో బీజేపీ బలం చెక్కుచెదరలేదా? కేంద్రంలో వరుసగా పదేండ్లపాటు అధికారంలో ఉన్న ఆ పార్టీ శత్రుదుర్భేద్యంగానే ఉన్నదా? ముఖాముఖి తలపడే రాష్ర్టాల్లో బీజేపీని ఓడించే సత్తా కాంగ్రెస్‌కు లేనట్టేనా? వివిధ రాష్ర్టాల్లోని ప్రాంతీయ శక్తులు కూడా ఇక కమలదళం ముందు తలవంచక తప్పదా? తెలంగాణ లాంటి దక్షిణాది రాష్ర్టాల్లోనూ కమలం వికసిస్తున్నదా? కేంద్రంలో ప్రధాని మోదీకి హ్యాట్రిక్ విజయం ఖాయమైనట్టేనా? బీజేపీ కేంద్రంలో మరే ఇతర పార్టీల సహకారం లేకుండానే, సొంత మెజారిటీతోనే మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందా?

భారత ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత వరుసగా మూడుసార్లు ఎన్నికైన ప్రధానిగా నరేంద్ర మోదీ రికార్డు సృష్టించబోతున్నారా? తాజాగా జరిగిన మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ర్టాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను చూసిన తర్వాత కూడా ఇంకా ఇలాంటి సందేహాలు ఎందుకన్న ప్రశ్న కలగడం సహజం. ముఖ్యంగా మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ ఫలితాలతో బీజేపీలో కదనోత్సాహం తొణికిసలాడుతున్నది.

ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ మీద సెటైర్లు పేల్చేస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవడంతో పాటు రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ర్టాల్లోనూ కాంగ్రెస్‌ను గద్దె దించి, అధికారంలోకి రావడం, తెలంగాణ అసెంబ్లీలోనూ తన సంఖ్యా బలాన్ని 8 స్థానాలకు పెంచుకోవడం నిస్సందేహంగా బీజేపీ శ్రేణులను ఉత్సాహపరిచే అంశమే. అయినా, ఆయా రాష్ర్టాల ఫలితాలను సావధానంగా విశ్లేషించుకుంటే ఆ పార్టీకి కొన్ని ప్రమాద హెచ్చరికలూ కనిపిస్తున్నాయి.

మరో ఆరు నెలల్లో లోక్‌సభ ఎన్నికలున్న నేపథ్యంలో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ర్టాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అగ్రనాయకత్వం సర్వశక్తులు ఒడ్డింది. ఆ మూడు రాష్ర్టాల ఎన్నికలను ప్రధాని మోదీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. తానే స్వయంగా అక్కడి ప్రత్యర్థులతో పోటీ పడుతున్నట్టుగా ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకత్వం ప్రాధాన్యాన్ని తగ్గించి, తన చుట్టూనే ఎన్నికల ప్రచారాన్ని కేంద్రీకరించారు. ఆయా రాష్ర్టాల్లో ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎవరినీ ప్రాజెక్ట్ చేయలేదు. పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలను ఎమ్మెల్యే అభ్యర్థులుగా బరిలోకి దింపారు. పార్టీ జాతీయ నాయకత్వం మొత్తం ఆ మూడు రాష్ర్టాలపై దృష్టి కేంద్రీకరించి పనిచేసింది. ఇంతచేసినా ఆ మూడు రాష్ర్టాల్లో బీజేపీ పొందిందేమిటి? పోగొట్టుకున్నదేమిటి? 2019 లోక్‌సభ ఎన్నికలతో పోల్చుకుంటే ఆ పార్టీ పరిస్థితి మెరుగుపడిందా? రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అదనంగా పొందగలిగేదేమిటి? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

లోక్‌సభ ఎన్నికలకు పెద్దగా సమయం లేదు. ప్రస్తుతం కొనసాగుతున్న లోక్‌సభకు 2019 ఏప్రిల్, మే నెలల్లో ఏడు విడుతలుగా పోలింగ్ జరిగింది. ఈ సారి కూడా ఇంచుమించు అదేవిధంగా పోలింగ్ జరిగే అవకాశం ఉంది. అప్పుడు కూడా ఇప్పటి మాదిరిగానే లోక్‌సభ ఎన్నికల కంటే ఐదారు నెలలు ముందుగానే మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ర్టాల అసెంబ్లీలకు ఎన్నికలు జరిగాయి. అప్పట్లో వాటిని సెమీ ఫైనల్స్‌గా భావించారు. ఎన్నికల ఫలితాల తర్వాత బీజేపీ మాత్రం వాటిని సెమీఫైనల్స్‌గా పరిగణించడానికి నిరాకరించింది. నాడు మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అనూహ్య విజయం సాధించడమే అందుకు కారణం. ఆనాటి ఫలితాలను చూసుకొని కాంగ్రెస్ మురిసిపోయింది. మళ్లీ కేంద్రంలో తమకు మంచి రోజులొస్తున్నాయని కాంగ్రెస్ నేతలు కలలుగన్నారు. ఇక నరేంద్ర మోదీ ప్రభుత్వం పడిపోతుందని, మళ్లీ తమ ఆధ్వర్యంలో సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఆశపడ్డారు. కానీ, 2019 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌కు భారీ షాక్ ఇచ్చాయి. అధికారంలోకి వచ్చిన ఆ మూడు రాష్ర్టాల్లోనూ ఆరు నెలలకే కాంగ్రెస్ చతికిలపడింది. మూడు రాష్ర్టాల్లో కలిపి మూడు ఎంపీ సీట్లను గెలుచుకోవడమే కాంగ్రెస్‌కు గగనమైపోయింది. రాజస్థాన్‌లో కనీసం ఒక్క ఎంపీ సీటు కూడా దక్కలేదు. మధ్యప్రదేశ్‌లో ఒకటి, ఛత్తీస్‌గఢ్‌లో రెండు ఎంపీ సీట్లు మాత్రమే దక్కాయి. ఆరు నెలల్లోనే ఎంత మార్పు?! 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆ మూడు రాష్ర్టాలను బీజేపీ క్లీన్‌స్వీప్ చేయడమే కాకుండా తెలంగాణలోనూ అనూహ్యంగా నాలుగు ఎంపీ స్థానాలు గెలుచుకొని ఆశ్చర్యపరిచింది. ఇప్పుడు కూడా అప్పటి మాదిరిగానే ఆయా రాష్ర్టాల ఓటర్ల మూడ్ మారితే బీజేపీ పరిస్థితి ఏమిటన్నది మరో ఆసక్తికర ప్రశ్న.

తాజా అసెంబ్లీ ఎన్నికల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ర్టాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటికీ, కాంగ్రెస్ పునాదులను పెకిలించలేకపోయింది. ఆ రెండు పార్టీల ఓటు షేర్‌లో స్వల్ప తేడా మాత్రమే ఉన్నది. మధ్యప్రదేశ్‌లో ఆ రెండు పార్టీలు సాధించిన ఓట్లలో దాదాపు 8 శాతం వ్యత్యాసం ఉన్నప్పటికీ, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ర్టాల్లో 2-4 శాతమే తేడా ఉండటం విస్మరించలేనిది.

ఛత్తీస్‌గఢ్‌లో 11, మధ్యప్రదేశ్‌లో 29, రాజస్థాన్‌లో 25 చొప్పున ఈ మూడు రాష్ర్టాల్లో కలిపి మొత్తంగా 65 లోక్‌సభ స్థానాలున్నాయి. ఇందులో ప్రస్తుతం 61 స్థానాలు బీజేపీ ఖాతాలోనే ఉన్నాయి. కాంగ్రెస్‌కు ఉన్నవి మూడంటే మూడే! 2018-19 మాదిరిగానే 2023-24లో కూడా అసెంబ్లీలో ఒక పార్టీకి, లోక్‌సభలో మరో పార్టీకి అవకాశం ఇద్దామని ఓటర్లు భావిస్తే ఆయా రాష్ర్టాల్లో ఎక్కువగా నష్టపోయేది బీజేపీయే. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతాన్ని కాంగ్రెస్ కాపాడుకోగలిగినా ఆ మూడు రాష్ర్టాల నుంచి బీజేపీ గెలుచుకోగలిగే ఎంపీ స్థానాల సంఖ్య ఏదో ఒక మేరకు పడిపోతుంది! ఏ కోణంలో చూసినా ఆ మూడు రాష్ర్టాల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఓట్ల శాతంలో ఉన్న తేడా బీజేపీకి ప్రమాదకర హెచ్చరికే!

మధ్యప్రదేశ్‌లో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సాధించిన 41.02 ఓట్లతో పోల్చుకుంటే తాజా అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన 48.76 శాతం ఓట్లు దాదాపు 8 శాతం ఎక్కువ. అయినా, 2019 లోక్‌సభ ఎన్నికల్లో సాధించిన 58.54 శాతం ఓట్లతో పోల్చుకుంటే దాదాపు 10 శాతం తక్కువన్న విషయాన్ని విస్మరించకూడదు. రాజస్థాన్‌లోనూ అదే పరిస్థితి. అక్కడ బీజేపీకి 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 39.5 శాతం ఓట్లు, 2019 లోక్‌సభ ఎన్నికల్లో 59.07 శాతం ఓట్లు లభించగా తాజా అసెంబ్లీ ఎన్నికల్లో 41.7 శాతం ఓట్లు లభించాయి. 2018 కంటే ఓట్ల శాతం పెరిగినా 2019తో పోల్చుకంటే తగ్గడం గమనార్హం.

ఛత్తీస్‌గఢ్‌లోనూ పరిస్థితి భిన్నంగా ఏమీ లేదు. అక్కడ బీజేపీకి 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 32.9 శాతం ఓట్లు, 2019 లోక్‌సభ ఎన్నికల్లో 51.44 శాతం ఓట్లు లభించాయి. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో 46.3 శాతం ఓట్లు దక్కాయి. ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ఓటు షేర్ 2019తో పోల్చుకుంటే దాదాపు 5 శాతం తగ్గడం గమనార్హం. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్‌ను ప్రభావితం చేసే అంశాలకు లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసే అంశాలకు తేడాలు ఉండే మాట వాస్తవమే అయినా ఆ మూడు రాష్ర్టాల్లో కాంగ్రెస్ ఓట్ల శాతం 40 దాకా ఉండటం చిన్న విషయమేమీ కాదు. ఈ మూడు రాష్ర్టాల్లో ఇండియా కూటమిలోని పార్టీలను కాంగ్రెస్ కలుపుకొని పోలేదని, దానివల్ల కొంత నష్టపోయిందన్న విశ్లేషణలూ వినిపిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల నాటికి ఇండియా కూటమిలోని పార్టీలతో ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో కాంగ్రెస్ వ్యవహరిస్తే.. ఎంతో కొంత లాభపడే అవకాశాలూ లేకపోలేదు.

తెలంగాణ అసెంబ్లీలో బీజేపీ సీట్ల సంఖ్య మునుపెన్నడూలేని రీతిలో 8కి పెరిగినప్పటికీ 2019 లోక్‌సభ ఎన్నికలతో పోల్చుకుంటే ఆ పార్టీ పరిస్థితి పెద్దగా మెరుగుపడలేదనే చెప్పాలి. ఎందుకంటే 2019లో బీజేపీ 19.65 శాతం ఓట్లు, నాలుగు ఎంపీ స్థానాలు గెలుచుకున్నది. కానీ, ఇప్పుడు ఆ పార్టీ ఓట్ల శాతం 14 లోపే ఉంది. అంతేకాదు, ఆ పార్టీ నుంచి ఎమ్మెల్యేలుగా పోటీచేసిన ముగ్గురు ఎంపీలు బండి సంజయ్, ధర్మపురి అరవింద్, సోయం బాపురావు ఓడిపోవడం దేనికి సంకేతమో బీజేపీ నేతలు విశ్లేషించుకునే తీరు మీదనే తెలంగాణలో ఆ పార్టీ భవితవ్యం ఆధారపడి ఉంటుంది.

కార్పొరేట్ సర్కార్ అనే పేరును మోదీ ప్రభుత్వం సార్థకం చేసుకున్నది. ఆర్థిక నేరస్థులకు అండగా నిలవడంలో తనకు తానే సాటి అని నిరూపించుకుంటున్నది. బ్యాంకుల్లో లోన్లు తీసుకొని ఎగ్గొట్టే వారికి బీజేపీ ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలిచింది. ఏకంగా రూ.10.6 లక్షల కోట్ల లోన్లను రైటాఫ్ చేసి కార్పొరేట్ల పట్ల తన అవ్యాజ్యమైన అభిమానాన్ని చాటుకున్నది.

మొండి బకాయిలకు మోక్షమెప్పుడో?

గడిచిన ఐదేండ్లలో కార్పొరేట్లకు సంబంధించిన రూ.10.6 లక్షల కోట్ల రుణాలు నిరర్థక ఆస్తులుగా మారిపోయాయి. వీటిలో సగానికిపైగా దేశంలోని అతిపెద్ద పారిశ్రామిక సంస్థలు ఎగ్గొట్టినవే కావడం శోచనీయం. షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు (ఎస్‌సీబీలు) ఈ మొత్తాలను నిరర్థక ఆస్తులుగా గుర్తించినట్టు స్వయాన కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ కరాడ్ లోక్‌సభ సాక్షిగా సెలవివ్వడం గమనార్హం.

2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.2.09 లక్షల కోట్ల రుణాలు రైటాఫ్ జాబితాలోకి చేరిపోయాయి. రూ.5 కోట్ల కంటే ఎక్కువ రుణాలు కలిగిన 2,300 మంది రుణగ్రహీతలు కేంద్రం చర్యల వల్ల లబ్ధి పొందారు. ఇందులో 52.3 శాతం రుణాలు పెద్దపెద్ద కార్పొరేట్ సంస్థలవే. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ మొత్తం భారీగా పెరిగింది. గతేడాది రూ.1.75 లక్షల కోట్ల రుణాలు రైటాఫ్ అయ్యాయి. ఇందులో 39.8 శాతం పెద్ద కార్పొరేట్ సంస్థలకు సంబంధించినవి. ఆర్బీఐ డాటా ప్రకారం 2012 నుంచి రూ.15.31 లక్షల కోట్ల రుణాలు రైటాఫ్ అయ్యాయి. అయితే నిరర్థక ఆస్తులుగా ప్రకటించిన రుణాల్లో ఎక్కువ మొత్తాలను బ్యాంకులు తిరిగి రాబట్టుకోలేకపోతున్నాయి. రుణాలను రైటాఫ్ చేయడంలో చూపిస్తున్న ఉత్సాహంలో ఒక్క శాతమైనా వాటిని రికవరీ చేయడంలో చూపించకపోవడం శోచనీయం. మొండి బకాయిల రికవరీ డాటాను చూస్తే ఈ విషయం స్పష్టంగా అర్థం అవుతున్నది.

మరోవైపు ఈ రైటాఫ్ వల్ల రుణ ఎగవేతదారులకు ఎలాంటి లబ్ధి చేకూరలేదని కేంద్ర సహాయ మంత్రి చెప్పడం విడ్డూరం. రుణ ఎగవేతదారుల నుంచి రుణాల రికవరీ కొనసాగుతుందని ఆయన చెప్పడం హాస్యాస్పదంగా అనిపిస్తున్నది. ఎందుకంటే ఒక్కసారి కార్పొరేట్ రుణాలు నిరర్థక ఆస్తులుగా మారిన తర్వాత ఏం జరుగుతుందో అందరికీ తెలిసిందే. రుణ ఎగవేతదారుల నుంచి మన దేశంలో ఇప్పటివరకు ఎంత మొత్తం తిరిగి రాబట్టారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. గత మూడేండ్లలో రూ.5.87 లక్షల కోట్ల రుణాలను రైటాఫ్ చేయగా.. వాటిలో రూ.1.09 లక్షల కోట్లను తిరిగి రాబట్టినట్టు ఆర్బీఐ డాటా ప్రకారం తెలుస్తున్నది. ఇది 18.60 శాతం మాత్రమే.

ఇప్పటికే విజయ్‌మాల్యా, నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ తదితర కార్పొరేట్లు బ్యాంకులను ముంచిన విషయం తెలిసిందే. భారీగా రుణాలు తీసుకొని దివాలా తీసిన వైనం మనందరం చూస్తునే ఉన్నాం. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం రైటాఫ్ చేసిన రుణాలు కూడా ఈ కోవలోకే వస్తాయి.

సామాన్యులు, రైతులు కాళ్లరిగేలా తిరిగినా రుణాలు ఇవ్వని బ్యాంకులు కార్పొరేట్లకు రెడ్‌కార్పెట్ పరిచి మరీ పెద్ద మొత్తంలో రుణాలను అంటగడుతున్నాయి. రుణాల రికవరీలోనూ ఈ తరహా సూత్రాన్నే బ్యాంకులు పాటిస్తున్నాయి. సామాన్యుల నుంచి రుణాలను ముక్కుపిండి మరీ వసూలు చేసే బ్యాంకులు కార్పొరేట్ల రుణాలను మాత్రం ఎప్పటికప్పుడు రైటాఫ్ చేస్తున్నాయి. బ్యాంకుల చర్యల కారణంగా రుణ ఎగవేతదారులు పెరుగుతున్నారే తప్ప తగ్గడం లేదు. ఏండ్లుగా పేరుకుపోయి భారత ఆర్థిక వ్యవస్థకు గుదిబండగా మారిన ఈ మొండి బకాయిలకు ఎప్పుడు మోక్షం కలుగుతుందో.

-ఎడిటోరియల్ డెస్క్